క్లుప్తంగా

పేద ముస్లింలకు సరుకుల పంపిణీ



ముస్లింలకు సరుకులు అందజేస్తున్న మొమిన్‌అహ్మద్‌హుసేన్

ఆత్మకూరు: రంజాన్‌ను పురస్కరించుకుని స్థానిక కొత్తపేటకు చెందిన పేద ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్‌అహ్మద్‌హుసేన్ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 కేజీల బియ్యం, 2 కిలోల కందిపప్పు, 2 ప్యాకెట్ల నూనె, కేజీ చక్కెర, కేజీ సేమియా, డబ్బా చట్నీ, అర కిలో బెల్లం, అర కిలో కొబ్బెర, అప్పడాలు, రెండు కిలోల కర్జూరాలను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్‌ముస్తఫా, ఇస్మాయిల్, జబీవుల్లా, ఇలియాజ్, గౌస్‌మాలిక్, ముఫ్తిమహ్మద్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

మహానంది: ప్రతి ఒక్కరి కృషితోనే మహాశివ రాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయని మహానంది దేవస్థానం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం అర్చకులు, వేదపండితులు, సిబ్బందితో దేవస్థానం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించి ఉత్సవాలను విజయవంతం చేశారన్నారు. అనంతరం దేవస్థానం అన్నప్రసాద వితరణ భవనం వద్ద భోజనాలు ఏర్పాటు చేసి అభినందించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి



గౌడ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో నిరుపేదలతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు వెయ్యి మంది నిరుపేదలకు ఇళ్లు లేవని, వారికి ఇంటి స్థలాలను మంజూరు చేసి ఇళ్లను నిర్మించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ బాబు, ప్రతాప్, వెంకటశివుడు, చాంద్‌బాషా, అహ్మద్‌హుసేన్, లల్లూ, యేసేపు, ముర్తుజాబి, షేక్షావలి, ఖాదర్, సురేష్, శివ పాల్గొన్నారు.


రేషన్ కార్డులు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు (మార్కిస్టు లెనినిస్టు)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడంలో జాప్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగార్జున, బీబీ, రామకృష్ణ, బజారు నాయుడు, లక్ష్మీదేవి, ముర్తుజాబీ పాల్గొన్నారు.

సూర్యప్రతాపం @ 40



నిర్మానుష్యంగా మహానంది ఆలయ పరిసరాలు

మహానంది: మహానంది మండలంలో సోమవారం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో భక్తులు గదుల నుంచి బయటికి రాకపోవడంతో ఆలయ ప్రాంగణాలు సోమవారం నిర్మానుష్యంగా కనిపించాయి.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన అన్నప్రసాద వితరణకు సోమవారం నల్గొండకు చెందిన వంగాల మోహన్‌రెడ్డి రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు ఎం.మల్లికార్జునకు అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాన్ని, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

మినుము పంట అన్నదాతలను నిండా ముంచేసింది. ఎన్నో ఆశలతో రబీలో సాగుచేసిన మినుము వర్షాభావం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. కాస్తో కూస్తో చేతికందిన దిగుబడులకు కూడా సరైన ధర లభించకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. – జూపాడుబంగ్లా



పల్లాకు, వైరస్ తెగులుతో దెబ్బతిన్న మినుము పంట

ముంచిన మినుము

- భారీగా తగ్గిన దిగుబడులు
- ధర కూడా అంతంత మాత్రమే..
- పట్టించుకోని కూలమి ప్రభుత్వం
- ఆందోళనలో అన్నదాతలు

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడు బంగ్లా, నందికొట్కూరు, 6,977 హెక్టార్లలో మినుము పంటను రైతులు సాగుచేశారు. వర్షాభావ పరిస్థితులు, పురుగు, తెగుళ్ల అధికం కావటం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో పూత, పిందె సక్రమంగా రాలేదు. బూడిదతెగులు, పల్లాకు తెగులు, వైరస్‌తో పాటు పురుగువ్యాప్తి అధికం కావటంతో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటలను కాపాడుకోగలిగారు. అయినా పంటచేతికొచ్చాకా నూర్పిడి చేసుకుంటే ఎకరాకు కేవలం క్వింటం నుంచి రెండు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి రావటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. విత్తనాలు, సేద్యం, రసాయనిక మందుల కోసం ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులైతే ఎకరాకు ముందస్తుగా రూ.20 వేల చొప్పున చెల్లించారు.

మిగిలింది అప్పులే..

మినుములో దిగుబడి తగ్గిపోవటంతో పాటు ధర అంతంత మాత్రమే ఉండటంతో రైతులకు అప్పులే మిగిలాయి. ఎకరాకు కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన మినుము ఈ ఏడాది క్వింటం నుంచి రెండు క్వింటాళ్లకే పరిమితమైంది. ఇక గత ఏడాది క్వింటం మినుము రూ.9 వేలు పైబడి అమ్ముడుపోగా ఈ ఏడాది రూ.7 వేల నుంచి రూ.8 వేలకు మించడం లేదు. దీంతో పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం వర్తింపజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో సాగైన మినుము పంట వివరాలు

మండలం	విస్తీర్ణం(హెక్టార్లలో)
జూపాడుబంగ్లా	907
పాములపాడు	1,650
మిడుతూరు	1,050
నందికొట్కూరు	850
పగిడ్యాల	650
కొత్తపల్లి	1,870
మొత్తం	6,97

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి



పది ఎకరాల్లో మినుము సాగుచేశాను. మొదట్లో బాగున్నా తర్వాత పల్లాకు తెగులు, వైరస్ వచ్చి పూత, పిందె తగ్గిపోయి పంట దెబ్బతినింది. దీనికితోడు పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాల్లేవు. బోర్లు, బావుల్లోని నీటిని పారించాను. దిగుబడి ఎకరాకు రెండు క్వింటాళ్లు వచ్చింది. నాకు ఎకరాకు రూ.60 వేల చొప్పున పెట్టుబడి అయింది. పది ఎకరాల మినుము పంట వల్ల నాకు అప్పులు మిగిలాయి. పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలి.
– సయ్యద్‌అరీఫ్, రైతు, రామసముద్రం

దిగుబడి తగ్గింది



ఎకరాకు రూ.20వేల ముందస్తు కౌలు చెల్లించి బోరు కింద ఏడు ఎకరాల్లో మినుము సాగుచేశాను. మొత్తం రూ.1.40 వేలు పెట్టుబడి పెట్టాను. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. మొత్తం 14 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. పెట్టుబడి కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.
–ఎల్లమ్మ,రైతు, రామసముద్రం

జిల్లా అధికారులకు నివేదించాం



మినుము పంట దిగుబడి తగ్గిన మాట వాస్తవమే. వ్యవసాయ, రెవెన్యూ, స్టాటిస్టికల్, బ్యాంకు బీమా అధికారుల సమక్షంలోనే పంటకోత ప్రయోగం నిర్వహించాం. దిగుబడి తగ్గినట్లు వెల్లడైంది. అవే వివరాలను జిల్లా అధికారులకు నివేదించాం. వారు పంట నష్టపరిహారం మంజూరు విషయమై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. – కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

పల్లకీలో విహరించిన మహానందీశుడి దంపతులు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు తీర్చారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కాగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

వ్యాసరచన పోటీలు

శ్రీశైలంటెంపుల్: త్వరలో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీశైలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు తెలిపారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో, పితృస్వామ్య నిబంధనలను సవాలు చేయడంలో పురుషుల ప్రమేయం అవసరం అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

పనిచేయని వీడియో కాన్ఫరెన్స్ సెట్

- ఇబ్బంది పడుతున్న మండల అధికారులు



మరమ్మతులకు గురైన వీడియోకాన్ఫరెన్స్ సెట్

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్ పనిచేయకపోవడంతో అధికారులు ప్రతి సోమవారం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించటం పరిపాటి. ఈనేపథ్యంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లోని వీడియోకాన్ఫరెన్స్ పరికరాలు మూడు వారాల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. ఉదయం 9.30 గంటలకల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని తహసీల్దార్, ఎంపీడీఓలతో పాటు మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరవ్వాల్సి ఉంటుంది. వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పనిచేయకపోవటంతో (పీజీఆర్ఎస్) పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంలో పాల్గొనేందుకు అధికారులు నందికొట్కూరులోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా అధికారులు స్పందించి వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను బాగు చేయించేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులు కోరుతున్నారు.

నాటు సారా తయారీ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

- ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేయడం చట్టరీత్యా నేరమని కర్నూలు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసి విక్రయించి కేసుల్లో ఇరుక్కొని జీవితాలను జైలు పాలు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్ఐ జబ్రుల్లా, బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి శివన్న పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



వన్యప్రాణి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వన్య ప్రాణులను సంరక్షించడం మన అందరి బాధ్యత అని యాంటీ పోచింగ్ రేంజ్ అధికారి రామకోటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వణ్య ప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జ్యోతి స్వరూప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ మార్పులు, విపత్తులు, మానవ కార్యకలాపాల వల్ల ఎన్నో ప్రాణులు కనుమరుగవుతున్నాయన్నారు. ఉనికి కోల్పోతున్న వన్యప్రాణులు, ఇతర జీవుల పునరుద్ధరణ, సంరక్షణ ప్రయత్నాలకు ప్రాధాన్యం పెంచాలన్నది ప్రపంచ వన్య ప్రాణుల సంరక్షణ దినోత్సవం ఉద్దేశమన్నారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు శివనాగయ్య, మహేశ్వరమ్మ, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు జెడ్పీ హై స్కూల్‌లో ప్రపంచ వన్య ప్రాణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ శాఖ అధికారి జెడ్ నాసిర్ ఝా సూచించారు.

అంకురార్పణ ధాన్యాలకు మొలకలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రారంభం రోజున ఆలయాల్లో అంకురార్పణ పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా మహానందిలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మట్టిపాత్రల్లో పుట్టమన్నును నింపి అందులో నవధాన్యాలు చల్లి నీరు పోసి అంకురార్పణ చేశారు. అంకురార్పణ ధాన్యాలు ఎంతో బాగా మొలకెత్తాయని, ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తప్పిపోయిన వృద్ధురాలిని పోలీసులు కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. తెలంగాణ రాష్ట్రం బడివి తాలూకా తాండూరు గ్రామానికి చెందిన బాసమ్మ బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం వచ్చి తప్పిపోయింది. శ్రీశైలం ఒకటవ పట్టణ సీఐ ప్రసాదరావు, దేవస్థాన ఈఈ బాలమురళీకృష్ణ ఆమె ఆచూకీ కనుగొని సోమవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పశువులకు టీకాలు వేయించుకోండి



పశువులకు టీకాలు వేస్తున్న ఏహెచ్ఏ సంధ్య

పగిడ్యాల: పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ సుమన్ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని రైతుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీకాలు వేయించటం వల్ల వ్యాధిసోకిన పాడిపశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని నివారించవచ్చన్నారు.. దూడల్లో మరణాలను తగ్గించి ఆరోగ్యంగా ఎదగటానికి దోహదపడుతుందని రైతులకు వివరించారు. నాలుగు మాసాలు దాటిన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. నాలుగు నుంచి 8 నెలల వయస్సు ఉన్న పెయ్యదూడల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పేదరైతుకలు పశుగ్రాసం పెంచుకొనేందుకు ఎస్సీ, ఎస్టీ సన్నకారు రైతులకు పదిసెంట్లలో పశుగ్రాసం పెంచుకోవచ్చన్నారు.

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్

కొత్తపల్లి: సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుందని తహసీల్దార్ ఉమా రాణి అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముగ్గురు రైతులు భూముల సర్వే కోసం, ఒక రైతు భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ దరఖాస్తులు ఇచ్చారని వీలైనంత త్వరగా వాటికి పరిష్కారం చూపాలని అధికారులకు తహసీల్దార్ సూచించారు.

ఇంటర్ పరీక్షకు ఇద్దరు గైర్హాజర్

జూపాడుబంగ్లా: ఇంటర్ ద్వితీయ ఏడాది వార్షిక పరీక్షలకు సోమవారం ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ రమేష్, డిపార్ట్‌మెంటల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 146 మంది విద్యార్థులకు గానూ 144 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

హెల్మెట్ ధరించాలి

జూపాడుబంగ్లా: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం ఆయన పోలీసుస్టేషన్ ఎదుట కేజీ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే రూ.1,000, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేకుండా మొదటిసారి పట్టుబడితే రూ.2 వేలు, రెండోసారి రూ.4 వేలు, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.1,500, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే మొదటి సారి రూ.1,500, రెండోసారి రూ.10 వేలు, యూనిఫాం లేకుండా ఆటో నడిపితే మొదటిసారి రూ.150, రెండోసారి రూ.300 జరిమానా విధిస్తామని వాహనదారులను హెచ్చరించారు.

అర్జీలు ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోండి

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో సమస్యలపై దరఖాస్తులు ఇచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. పగిడ్యాల, నెహ్రూనగర్ గ్రామాలకు చెందిన ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం చంద్రకళ, ఏఓ జ్యోతివిజయకుమార్ పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

భార్యను హింసించిన భర్తపై కేసు నమోదు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామానికి చెందిన గొల్ల నరేష్ మద్యం తాగి భార్య రేవతిని హింసిస్తుండటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. ఆత్మకూరు మండలం శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన రేవతికి పారుమంచాల గ్రామానికి చెందిన గొల్ల నరేష్‌కు 2016లో వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. నరేష్ నిత్యం మద్యం తాగి భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండటంతో పాటు గతనెల 27న రోకలి బండతో మోదడంతో చేయి విరిగింది. చికిత్స అనంతరం బాధితురాలు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట

పాములపాడు: మండల కేంద్రంలో సోమవారం చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ట వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్రములు, అభిషేకం ప్రతిష్ట హోమాలు, యంత్ర ప్రతిష్ఠాపన, అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠాపన, కక్షాగ్ని జ్వాల, అమ్మవారి దర్శనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి, వేద స్వస్తి కలశ విసర్జన, మార్జన, మహదా ఆశీర్వచనం పూజలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారి విగ్రహాన్ని గ్రామం నుంచి పొలిమేర వరకు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

రీసర్వే చేసి హద్దులు చూపండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



ప్రజల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

బండి ఆత్మకూరు: రీసర్వే పూర్తి చేసి హద్దులు చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని కడమల కాలువ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆమె సోమవారం తనిఖీ చేశారు. రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. చెరువుకు సంబంధించిన 50 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె.. ఆక్రమణదారులకు నోటీసులిచ్చి, సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో వెలసిన శివనంది, విష్ణు నంది ఆలయాల్లో కలెక్టర్ పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు స్వాగతం పలికి, అభిషేకం, కుంకుమార్చన పూజలు చేయించి, ఆశీర్వచనాలు చేశారు. కలెక్టర్ వెంట ఏడీ జయరాజ్, తహసీల్దార్ పద్మావతి, సర్వేయర్ పర్వీన్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తపల్లి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. సోమవారం మండలంలోని ఎదురుపాడు, కొత్త మాడుగుల గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీత ఇంటింటా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత మంచి మార్గంలో నడిపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సంజీవ, పార్థసారథి, చక్రపాణి, మనోహర్, నాగమద్దిలేటి, శేషన్న, భాస్కర్, పార్వతమ్మ, వెంకటేశ్వరమ్మ, నాగలక్ష్మి, మరియమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బిస్మిల్లా మినరల్ వాటర్ ప్లాంట్ సీజ్



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: పట్టణంలోని బిస్మిల్లా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆర్డీఓ నాగజ్యోతి సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 27న కలుషిత నీరు తాగడం వల్ల పది మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. పట్టణంలోని రక్షిత మంచినీరు ట్యాంకులతో పాటు 12 మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిర్వహించగా నీలితొట్టి వీధిలోని బిస్మిల్లా మినరల్ వాటర్ ప్లాంట్‌లో బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. ఇందు కోసం ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. కాగా అధికారులు వాస్తవ పరిస్థితులను కప్పి పుచ్చేందుకే తమ కాలనీలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారని కాలనీ వాసులు ఆరోపించారు. అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఆమె వెంట కమిషనర్ రమేష్ బాబు ఉన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



సింగం వినయ్, సింగం శిరీష (ఫైల్)

చాదర్‌ఘాట్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ రవిరాజ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌బాగ్ డివిజన్ జమున టవర్స్‌లో 106 సింగం వినయ్, శిరీష(32) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె. శిరీష ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తుండగా, ఆమె భర్త వినయ్ ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం శిరీషకు గుండెపోటు వచ్చిందని ఆమె మేనమామ మధుకర్‌కు శిరీష స్నేహితురాలు సమాచారం అందించింది. దీంతో మధుకర్ ఆమె ఇంటికి వెళ్లేలోగా వినయ్ ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. శిరీషను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించాడు. దీంతో వినయ్ శిరీష మృతదేహాన్ని తీసుకుని అంబులెన్స్‌లో తన స్వగ్రామమైన దోమలపెంటకు బయలుదేరి వెళ్లాడు. దీనిపై అనుమానం వచ్చిన మధుకర్ చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన పోలీసులు అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ చేసి మృతదేహాన్ని వెనక్కి రప్పించారు. కాగా శిరీష శరీరంపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శిరీషను ఆమె భర్త వినయ్ కొట్టి చంపాడని మేనమామ మధుకర్ ఆరోపిస్తున్నారు. శిరీషపై అనుమానం పెంచుకున్న వినయ్ తరచూ ఆమెను వేధించేవాడని తెలిపాడు. 2017లో వారు ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపాడు. చాదర్‌ఘాట్ పోలీసులు ఆమె భర్త వినయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విజయోత్సవం



కేకు కట్ చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఆత్మకూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ, మిత్ర సంఘాల అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు విజయం పట్ల పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, మిత్ర సంఘాల నాయకులు శంకర్, శివప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు పట్టణంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాదె శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నూర్‌మొహమ్మద్, సయ్యద్‌ఇబ్రహీం, హుసేన్‌సాహెబ్, దామరేకుల రవి, రామిరెడ్డి, ఆత్మకూరు మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రదీప్, హనుమంతు, కొత్తపల్లె అధ్యక్షులు సయ్యద్ కలిముల్లా, శ్రీనివాసులు, మిత్ర సంఘాల నాయకులు కె.శంకర్, ఉమ్మర్, రాంబాలాజీనాయక్, శోభన్‌బాబునాయక్ పాల్గొన్నారు.